## ఈజీఎస్‌ను యధాతథంగా

# కొనసాగించాలి

### జీపీ తీర్మానం చేయాలని వినతి



**టీ మీడియా, డిసెంబర్ 29, సింగరేణి (కారేపల్లి) :** మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని యధాతథంగా కొనసాగించాలని వ్యవసాయ కార్మిక సంఘం ఖమ్మం జిల్లా ఉపాధ్యక్షులు కొండబోయిన నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. ఈజీఎస్‌ను యధావిధిగా కొనసాగించాలని కోరుతూ తీర్మానించాలని సోమవారం సింగరేణి జీపీ సర్పంచ్ మేదరి వీరప్రతాఫ్(టోనీ), పాలకవర్గానికి వ్యవసాయ కార్మిక సంఘం వినతిపత్రం అందజేసింది. ఈసందర్భంగా కొండబోయిన నాగేశ్వరరావు మాట్లాడుతూ కేంద్రంలోని మోదీ ప్రభుత్వం వీబీజీ రామ్‌జీ పేరుతో చట్ట సవరణను చేస్తుందన్నారు. కేంద్రం ఉపాధి హామీ చట్టం నుండి తప్పించుకోనటానికి చట్టాన్ని, స్కీమ్ మారుస్తుందన్నారు. చట్ట సవరణతో 60 శాతం నిధులు కేంద్రం 40 శాతం నిధులు రాష్ట్ర ప్రభుత్వం భరించాల్సి ఉంటుందన్నారు. ఉన్న ఉపాధి కార్డుల రద్దు చేస్తుందని, కొత్తకార్డు జారీ నిలిపివేసిందన్నారు. పేదలకు ఉపాధీ ని దూరం చేసే వీబీజీ రామ్‌జీ బిల్లుపై పంచాయతీలు తీర్మానించి పేదల పక్షాన నిలవాలని కోరారు. ఈకార్యక్రమంలో వ్యకాస నాయకులు తలారి దేవప్రకాష్, ముక్క సీతారాములు, ఇల్లంగి పిచ్చయ్య, పాసిన్ని నాగేశ్వరరావు, పిట్టల నాగరాజు, నల్లబెల్లి ప్రతాప్, అన్నారపు కృష్ణ తదితరులు ఉన్నారు.

# బోర్‌వెల్ వాహనాలు స్వాధీనం

### అటవీ చట్టాలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు - ఎఫ్‌డీవో మంజుల

**టీ మీడియా, డిసెంబర్ 29, సింగరేణి (కారేపల్లి):** కారేపల్లి ఫారెస్ట్ రేంజ్ పరిధిలోని చీమలపాడు అటవీ ప్రాంతంలో అక్రమంగా బోరు లు వేస్తున్న రెండు వాహనాలను ఫారెస్టు అధికారులు 28వ తేది తెల్లావారుజామున పట్టుకున్నారు. దీనికి సంబంధించి ఖమ్మం ఫారెస్టు డివిజనల్ అధికారి వీ.మంజుల వివరాలు వెల్లడించారు. రాగబోయినగూడెం నార్త్ బీట్ కంపార్ట్‌మెంట్ నెం.14/2 లో ప్రభుత్వ అనుమతులు లేకుండా అక్రమంగా బోరు పాయింట్లు వేస్తున్నారు. విశ్వాసనీయ సమాచారం మేరకు ఎఫ్‌డీవో ఆధ్వర్యంలో ఖమ్మం స్పెషల్ టీమ్ కారేపల్లి రేంజ్ అటవీ సిబ్బంది సంయుక్తంగా తనిఖీలు చేపట్టింది. ఈ తనిఖీలలో టీఎస్12 ఈకే 3699, ఏపీ04ఏపీ3294 బోరు వాహనాలను స్వాధీనం చేసుకున్నట్లు ఎఫ్‌డీవో తెలిపారు. దీనికి సంబంధించి ముగ్గురు నిందితులపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. అటవీ భూముల పరిరక్షణలో భాగంగా, రిజర్వ్ ఫారెస్ట్ ప్రాంతాల్లో అక్రమ తవ్వకాలు, అక్రమ రవాణా వంటి చర్యలపై కఠినమైన పరిరక్షణ



విధానాలను పాటిస్తున్నామన్నారు. అటవీ చట్టాలను ఉల్లంఘించే వారిపై కఠిన చర్యలు తప్పవని ఎఫ్‌డీవో వి.మంజుల హెచ్చరించారు. అటవీ ప్రాంతాల్లో అక్రమ కార్యకలాపాలు గమనిస్తే అటవీ శాఖ అధికారులకు సమాచారం అందించాలని ప్రజలను ఎఫ్‌డీవో కోరారు. ఈ దాడులలో ఫారెస్టు సెక్షన్ ఆఫీసర్ పి కిషోర్‌కుమార్, ఫారెస్ట్ బీట్ ఆఫీసర్లు బి.సైదా, డి.శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.